క్లుప్తంగా

నేడు తుక్కుగూడలో మంత్రి సబిత పర్యటన

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలో ఆదివారం మంత్రి సబితారెడ్డి పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు మంత్రి సబిత జిన్నాయిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుంటారని తెలిపారు. 11 గంటలకు పట్టణంలోని ఎస్ఎస్ గార్డెన్‌లో గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి హాజరవుతారని, పార్టీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

నోటు పుస్తకాల పంపిణీ



నాదర్‌గుల్‌లో నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఇందుమతి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ ప్యారం విజయభారతి విద్యాసాగర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం బీఎస్పీ మహేశ్వరం నియోజకవర్గం అసెంబ్లీ మహిళా కన్వీనర్ ఇందుమతి విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయాలను దృష్టిలో పెట్టుకుని అందరూ బాగా చదివి విద్యావంతులు కావాలని కోరారు. రాబోయే బహుజన రాజ్యంలో డా. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ముఖ్యమంత్రి అయితే విద్య, వైద్యానికి ఎలాంటి ఇబ్బంది ఉండవని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, యామిని, అరవింద్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ కందుకూరు అధ్యక్షుడిగా అంజిరెడ్డి



కందుకూరు: లయన్స్ క్లబ్ కందుకూరు నూతన అధ్యక్షుడిగా నిమ్మ అంజిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ఆ క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ ఆధ్వర్యంలో కందుకూరు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా వెంకటేశ్వర్ గుప్తా, కోశాధికారిగా రామన్‌బాబు, ఉపాధ్యక్షుడిగా చెన్నకిషన్‌రెడ్డి, మెంబర్‌షిప్ చైర్మన్‌గా అమరేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఏడాది పాటు వీరు పదవిలో ఉంటారని మండల అధ్యక్షుడు బిఆర్.రాంరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు అంజయ్య, రాంరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి

హస్తినాపురం: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంలాంటిదని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన చంద్రకళ అనే మహిళకు బ్రెయిన్‌స్ట్రోక్ రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. అనంతరం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత వారి ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సంప్రదించారు. స్పందించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చంద్రకళ ఆపరేషన్‌కు అయిన ఖర్చు డబ్బుల వివరాలతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయించారు. బాధితురాలికి రూ. 3 లక్షలను మంజూరు చేయించి అందుకు సంబంధించిన చెక్కును బాధితురాలి భర్తకు అందజేశారు. కార్యక్రమంలో నేతలు శ్రీకాంత్‌రెడ్డి, రాకేశ్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

ఎల్‌బీనగర్: ప్రజలు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తతోపాటు జాగ్రత్తలు తీసుకోవాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. వైదేహీనగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... రోజురోజుకూ కొత్తకొత్త రోగాలు ప్రజల దరికి చేరుతున్నాయని, ప్రజలు వ్యాధుల పట్ల డాక్టర్ల సలహాలు సూచనలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజల కోసం మెగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, కాలనీ నేతలు కిషన్‌రావు, ప్రసాద్, జంగారెడ్డి, చౌదరి, బుచ్చయ్య, ఆంజనేయులుతో పాటు ఆపోలో హాస్పిటల్, స్మార్ట్ విజన్ డెంటల్ ఆస్పత్రు వైద్యులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించండి

తలకొండపల్లి: ముదిరాజ్‌ల మహనీయులైన పండుగ సాయన్న, హైదరాబాద్ తొలి మేయర్ కొరివి కృష్ణ, సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలే విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని కేటాయించాలని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు బోళ్ళ యాదగిరి డిమాండ్ చేశారు. శనివారం యాదగిరి ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు గ్రామ సర్పంచ్ లలితా, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ పక్కన విగ్రహాల ఏర్పాటుకు స్థలం అనువుగా ఉందని, స్థలాన్ని కేటాయించాలని కోరారు.

రక్షణ వలయం ఎప్పటికో ?

- నిండుకుండలా రావిర్యాల పెద్ద చెరువు
- నిత్యం పర్యాటకుల సందడి



చెరువు కట్టపై ఫొటో దిగుతున్న పర్యాటకులు

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని రావిర్యాల పెద్ద చెరువు పూర్తిస్థాయిలో నిండి కళకళలాడుతోంది. దాదాపు అర కిలో మీటరు మేర విస్తరించి ఉన్న ఈ చెరువు కట్ట పైనుంచి వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. రావిర్యాల సమీపంలో వండర్ లా ఉండడంతో ఈ ప్రాంతం పర్యాటకులతో రద్దీగా ఉంటుంది. చెరువులోకి నీరు చేరి ఏడాది కావస్తున్నా ఇంత వరకు మున్సిపల్ అధికారులు రక్షణ వలయాలు ఏర్పాటు చేయలేదు. చాలా మంది ప్రమాదకర చెరువు కట్టపై ఫొటోలు, సెల్ఫీలకు ప్రయత్నిస్తున్నారు. గ్రామానికి అతి సమీపంలో చెరువు ఉండడంతో చిన్నారులు అక్కడి వెళుతున్నారు. ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సి వస్తోందోనని పిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు కట్ట దిగువన బీటీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండడంతో వాహనదారులు కట్ట మీద ఉన్న ప్రయాణం సాగిస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో మట్టి రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది.

పొంచి ఉన్న ప్రమాదం



రావిర్యాల చెరువు నీటితో నిండు కుండలా దర్శనమిస్తోంది. ఈ చెరువు కట్టపై గల రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రక్షణ వలయం కూడా లేదు. దీంతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. మట్టి రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయాలి.

– నవీన్‌రెడ్డి, రావిర్యాల

విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం ప్రతినిధులు

కందుకూరు: సాయుధ పోరాట యోధుడు, తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమరయ్య విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలని కురుమ సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో సంఘం మండల అధ్యక్షుడు సత్తయ్య మాట్లాడుతూ.. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే విగ్రహావిష్కరణకు హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, రాష్ట్ర ఎమ్మెల్సీ మల్లేశం, ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, అంజయ్యయాదవ్ తదితరులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, సర్పంచ్ ప్రభాకర్, ఎంపీటీసీలు పద్మపాండు, మల్లేష్, నాయకులు యాదగిరి, పర్వతాలు, తిరుపతయ్య, మల్లేష్, మహేందర్, బండ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

గ్రీన్ ఇండియా చాలెంజ్ కో ఫౌండర్ రాఘవ

కడ్తాల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాలని, గ్రీన్ ఇండియా చాలెంజ్ కో ఫౌండర్ సంజీవల్ల రాఘవ అన్నారు. శనివారం మండలంలోని పల్లెప్రకృతి వనాన్ని స్థానిక సర్పంచ్ లక్ష్మీ నర్సింహారెడ్డితో కలిసి సందర్శించి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో మొక్కలు నాటడం జరుగుతుందని, తద్వారా 24 శాతం అవరించి ఉన్న పచ్చదనం 33శాతానికి చేరుకుందని తెలిపారు. గ్రామంలో గ్రామ పంచాయతీ పాలకమండలి ఆధ్వర్యంలో మొక్కలు నాటి సంరక్షిస్తున్న విధానం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు అశోక్, నాయకులు భాస్కర్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

గ్రూప్ -4 పరీక్షలు ప్రశాంతం



మీర్‌పేట: జిల్లెలగూడలోని పరీక్ష కేంద్రం వద్ద ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ

మీర్‌పేట: పట్టణంలో గ్రూప్–4 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 19 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించినట్లు మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. 6,792 అభ్యర్థులకు, గాను 5,334 మంది పరీక్షకు హాజరయ్యారని చెప్పారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించామని, పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ తెలిపారు. ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ, వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తం రెడ్డి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

ప్రశాంతంగా..

హుడాకాంప్లెక్స్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ శనివారం నిర్వహించిన గ్రూప్–4 పరీక్ష ప్రశాంతంగా జరిగాయి. సరూర్‌నగర్ మండల కేంద్రంలోని విక్టోరియా మెమోరియల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో 456 మందిని కేటాయించారు. పరీక్షకు 358 మంది మాత్రమే హాజరయ్యారని ప్రిన్సిపాల్ ప్రభుదాస్ తెలిపారు.

కందుకూరులో..

కందుకూరు: మండల కేంద్రంలో శనివారం గ్రూప్-4 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. నాలుగు పరీక్ష కేంద్రాల్లో 912 మందికి ఏర్పాట్లు చేయగా 635 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. నోబుల్ హైస్కూల్‌లో 312 మందికి గాను 218 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 240 మందికి గాను 168 మంది, విద్యామయి జూనియర్ కళాశాలలో 240 మందికి గాను 162 మంది, కందుకూరు జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో 120 మందికి గాను 87 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు.

కనిపించే దేవుళ్లు వైద్యులు

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీరాములు



బడంగ్‌పేట్: వైద్యులను సన్మానించిన శ్రీరాములు

బడంగ్‌పేట్: కనిపించే దేవుళ్లు వైద్యులని, వారి సేవలకు వెల కట్టలేమని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న జన్ సంపర్క్ యాత్ర శనివారంతో 10వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంతర్జాతీయ డాక్టర్స్ డేను పురస్కరించుకుని శ్రీశ్రీ హోమ్స్ కాలనీలో డాక్టర్లను, బీజేపీ రాష్ట్ర మెడికల్ సెల్ వైద్యులకు బొకేలు ఇచ్చి ఘనంగా సన్మానించారు. కరోనా సమయంలో వైద్యుల సేవలు ఎప్పటికీ మరచిపోలేమన్నారు. ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనలో ప్రజా సంక్షేమం కోసం, దేశ రక్షణ కోసం చేపట్టిన పథకాలను వివరిస్తూ గడపగడపకు పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ బడంగ్‌పేట కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు శ్రీధర్‌రెడ్డి, మాధురి, పద్మ, సునిత, ఇంద్రసేనా, అమిత, రమాదేవి, అనిత, లక్ష్మారెడ్డి, శంకర్, నాయకులు జంగారెడ్డి, నాగార్జున, శూరకర్ణారెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, వెంకటేష్, చిత్రం శ్రీను పాల్గొన్నారు.

వైద్యుల సేవలు వెలకట్టలేనివి

కందుకూరు: రోగులకు వైద్యులు అందించే సేవలు వెలకట్టలేనివని లయన్స్‌క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. నేషనల్ డాక్టర్స్ డేను పురస్కరించుకుని కందుకూరు లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ రాధిక, డాక్టర్ హరినాథ్, డాక్టర్ నిర్మలాదేవి, డాక్టర్ అఖిల, డాక్టర్ రాజ్‌కుమార్‌తో పాటు పశువైద్యాధికారిణి డాక్టర్ రేవతి తదితరులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారతరత్న బీసీ రాయ్ స్మారకార్థం జరుపుకునే ఈ కార్యక్రమంలో మానవసేవే మాధవ సేవగా భావించే వైద్యులను సన్మానించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. మారుమూల గ్రామాల్లో అంకితభావంతో పని చేసే ప్రభుత్వ వైద్యుల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల వైద్యాధికారిణి డాక్టర్ రాధిక మాట్లాడుతూ.. కందుకూరు లయన్స్‌క్లబ్ సేవలను ప్రజలు వినియోగించుకుని లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా సభ్యుడు తాళ్ల అంజయ్య, కార్యదర్శి వెంకటేష్ గుప్తా, కోశాధికారి రామన్‌బాబు, టి.ఆంజనేయులు, దేశం సత్తిరెడ్డి, క్లెం జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే సంబురాలు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని లార్డ్స్ ఒలంపియాడ్ పాఠశాలలో శనివారం డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు వైద్యుల వేషధారణలో వచ్చి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప మాట్లాడుతూ.. కనిపించే దైవాలే వైద్యులని, వారి సేవలు ఈ ప్రపంచం మరిచిపోలేదన్నారు. కరోనా సమయంలో డాక్టర్ల సేవలు ఎంతో గొప్పవన్నారు. ఎందరో వైద్యులు తమ ప్రాణాలను సైతం త్యాగం చేశారని అన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల వైస్ చైర్మన్ బి.శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ అనురాధ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



కందుకూరు: వైద్యులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు



బడంగ్‌పేట్‌లోని లార్డ్స్ స్కూల్‌లో డాక్టర్స్ డే సంబురాలు

బీఆర్ఎస్‌ది మోసపూరిత పాలన



ద్వారకానగర్ కాలనీలో పర్యటిస్తున్న సామ రంగారెడ్డి

హస్తినాపురం: తొమ్మిది సంవత్సరాల కేంద్ర ప్రభుత్వ సుపరిపాలనలో ప్రజలు సురక్షితంగా ఉన్నారని, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం మోసపూరితమైన పాలనతో ప్రజలను దగా చేస్తోందని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ ద్వారకానగర్ కాలనీ, జయకృష్ణ ఎన్‌క్లేవ్‌కాలనీ, ఊర్మిళనగర్‌కాలనీ, టీచర్స్ కాలనీలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పి.నరేశ్ యాదవ్‌తో కలిసి మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సామ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం కరోనా సమయంలో ప్రతి పేదవాడి కడుపు నిండాలని 5 కిలోల ఉచిత బియ్యాన్ని అందించిందన్నారు. సీఎం కేసీఆర్ తొమ్మిది సంవత్సరాల కాలంలో పేదవారికి ఒక్క రేషన్ కార్డు కూడి ఇవ్వలేదని ఆరోపించారు. దీంతో పేదలు ఉచిత రేషన్‌కు దూరమయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నేతలు దుర్గయ్యగౌడ్, అమరేందర్‌రెడ్డి, అరుణసింగ్, శిరీష, శేఖర్‌గౌడ్, రాజవర్ధన్, మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

పార్టీ నిర్మాణంలో యువత పాత్ర కీలకం

బీఆర్ఎస్ నాయకుడు ప్రశాంత్ కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

మంచాల: బీఆర్ఎస్ పార్టీ నిర్మాణంలో యువత పాత్ర చాలా కీలకమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన యువజన విభాగ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ యువతకు తగ్గిన ప్రాధాన్యత ఇస్తుందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. పుట్టిన పాప నుంచి మొదలుకొని పండు ముసలి వరకు ప్రభుత్వం ఫలాలు అందించడం జరుగుతుందన్నారు. యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడమే కాకుండా ఈ ప్రాంతంలో నిరుద్యోగ యువతకు ఎక్కువగా ఉపాధి కల్పించే దిశగా పరిశ్రమలను తీసుకొని రావడం జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి బీఆర్ఎస్ పార్టీని అధిక మెజార్టీతో గెలుపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 5వ తేదీన ఇబ్రహీంపట్నంలో నిర్వహించే యువ సమ్మేళన కార్యక్రమానికి యువతను పెద్ద ఎత్తున కదిలి రావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్ , ప్రధాన కార్యదర్శి బహదూర్, పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జానీ పాష, నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు జెర్కొని రాజు, మండల యువజన విభాగం అధ్యక్షుడు బద్రినాథ్ గుప్తా, కార్యదర్శి విజయ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే, ఆగాపల్లిలో ఉపసర్పంచ్ ఎం.డీ. రఫీక్ తల్లి చనిపోవడంతో ప్రశాంత్‌కుమార్‌రెడ్డి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అభ్యర్థులకు సర్టిఫికెట్ల అందజేత

తలకొండపల్లి: మండల ఐకేపీ ఆధ్వర్యంలో పొదుపు మహిళా సంఘాల నుంచి ఒక్కరు చొప్పున మండలంలోని వెల్జాల్, యడవల్లి, చుక్కాపూర్, మెదక్‌పల్లి క్లస్టర్ల గ్రామాల నుంచి వీఓఏలు బాగ్యలక్ష్మి, మంజుల, అంజలి, శ్రీలతలు ఆర్థిక అక్షరాస్యతపై శిక్షణ పొందేందుకు ఎంపికయ్యారు. శంషాబాద్ ముచింతల్ ఆర్కిసెట్ బిల్డింగ్‌లో ఐదు రోజుల పాటు వీరికి శిక్షణ ఇచ్చారు. వీరి శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాకర్ వీరికి సర్టిఫికెట్లను అందజేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణ పొందడమే గాకా, శిక్షణలో నేర్చుకున్న విషయాలను గ్రామాల్లోని మిగతా సభ్యులకు చెప్పాలన్నారు. అవసరమైతే గ్రామస్థాయిలో శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎం బాలురాజు తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రభాకర్

న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలి

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న బీఎస్పీ ప్రవీణ్‌కుమార్

దిల్‌సుఖ్‌నగర్: రాష్ట్రంలో న్యాయవాదులకు కోసం ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆర్‌కేపురం డివిజన్‌లోని భాగ్యనగర్ ఫంక్షన్ హాల్‌లో బహుజన అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల రక్షణ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ... రాష్ట్రంలో న్యాయవాదులపై జరుగుతున్న దాడులను ముఖ్యమంత్రి కేసీఆర్ ఎందుకు సమాధానం చెప్పడం లేదని అన్నారు. రాష్ట్రంలో రోజురోజుకూ న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రక్షణ చట్టం తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం సాధన కోసం జరిగిన ఉద్యమంలో న్యాయవాదుల పాత్ర మరువలేనిదన్నారు. మరోసారి న్యాయవాదులు తమ హక్కుల కోసం ఉద్యమించాల్సిన అవసరం ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో న్యాయవాదులపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని తెలిపారు. బహుజన్ సమాజ్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత న్యాయవాదులకు, డాక్టర్లు, ఇతర రంగాల్లో ఉన్నవారికి ప్రత్యేక సమగ్ర రక్షణ చట్టాన్ని తెస్తామని పేర్కొన్నారు. 41(ఎ) సీఆర్‌పీసీ చట్టాన్ని పోలీసులు నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 41(ఏ) వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎస్ఐలకు, సీఐలకు పోస్టింగ్‌లు కావాలంటే స్థానిక ఎమ్మెల్యే లెటర్ ఇస్తేనే పోస్టింగ్‌లు వస్తున్నాయని, డీఎస్పీ స్థాయి అధికారులకు మంత్రులు డీజీపీ లేటర్ రాస్తేనే పోస్టింగ్‌లు వచ్చే పరిస్థితి ఉందన్నారు. ఇలా ఉంటే పేదలకు ఎలా న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. న్యాయవాదులపై రాజకీయ నాయకుల వత్తిడి తగ్గే విధంగా చట్టాలు తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. యువ న్యాయవాదుల కార్యాలయాల కోసం బహుజన రాజ్యంలో 5 లక్షల నుంచి 10 లక్షల ఆర్థిక సహాయం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా బహుజన అడ్వకేట్స్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ న్యాయవాదుల హెల్త్ ఇన్సూరెన్స్ రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు పెంచాలి, జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ. 5 వేల స్కాలర్‌షిప్ ఇవ్వాలని, మహిళ న్యాయవాదులపై వేధింపులను అరికట్టి, వారికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్, పటోళ్ల మాధవరెడ్డి, ఫణీంద్ర భార్గవ్, రాధిక, స్వప్న, అర్జున్, రమణ, గ్యార సతీష్, ప్రవీణ్, జగన్‌గౌడ్, కిరణ్‌కుమార్, రామ్ స్వర్ణలత, కవిత తదితరులు పాల్గొన్నారు.

తండా రోడ్లకు రూ.14.24 కోట్లు



నిధుల మంజూరు వివరాలు వెల్లడిస్తున్న దశరథ్‌నాయక్, నాయకులు

కడ్తాల్: కడ్తాల్ మండలంలోని 9 తండాలకు బీటీ రహదారుల నిర్మాణానికి, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద రూ.14.24 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆయన నిధులకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారి కర్కల్ పహాడ్ గ్రామం నుంచి నార్లకుంట తండా మీదుగా, చల్లంపల్లి వరకు బీటీరోడ్డు నిర్మాణానికి రూ.3.30 కోట్లు, చరికొండ బీటీ రోడ్డు నుంచి బోయిన్‌గుట్టతండా వరకు రూ.రూ.2.10 కోట్లు, గడ్డమీదితండా పీడబ్ల్యూ రోడ్డు నుంచి వెలుగురాళ్లతండా రోడ్డుకు రూ.1.20 కోట్లు, ముక్తమాధారం నుంచి నాగిరెడ్డి తండా బీటీ రోడ్డుకు రూ.1.20 కోట్లు, అన్మాస్‌పల్లి నుంచి పుల్లేరుబోడ్ తండా బీటీ రోడ్డుకు రూ.1.20 కోట్లు, కడ్తాల్ నుంచి కానుగుబావితండా బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.20 కోట్లు, అన్మాస్‌పల్లి బీటీరోడ్డు నుంచి పోచమ్మగడ్డ తండా రోడ్డుకు రూ.75 లక్షలు, వాస్‌దేవ్‌పూర్ నుంచి బాలాజీనగర్ తండా బీటీ రోడ్డుకు రూ.1.50 కోట్లు, రేకులకుంట తండా నుంచి చల్లంపల్లి బీటీ రోడ్డుకు రూ.2.10 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఆయా 9 తండాలకు సంబంధించిన రోడ్ల నిర్మాణ పనులకు, సోమవారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శంకుస్థాపన చేయనున్నట్లు జెడ్పీటీసీ తెలిపారు. బీటీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు, సీఎం కేసీఆర్‌కు తండావాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గిరిజనుల సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి గిరిజనులు అండగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్త, వైస్‌ఎంపీపీ ఆనంద్, రైతుబంధు మండల కో ఆర్డినేటర్ వీరయ్య, ఎంపీటీసీలు గోపాల్, లచ్చిరామ్‌నాయక్, సర్పంచ్‌లు రవీందర్‌రెడ్డి, లోకేశ్, సులోచన, కమ్లీబీచ్యానాయక్ పాల్గొన్నారు.

ఉద్యోగ సాధనే లక్ష్యంగా..



మాట్లాడుతున్న ఎంపీపీ కృపేశ్, జగదీశ్వర్

ఇబ్రహీంపట్నం: యువత ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో ఎంకేఆర్ ఫౌండేషన్ కృషి చేస్తుందని ఎంపీపీ కృపేశ్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు, ఆ పార్టీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్‌లు అన్నారు. ఇబ్రహీంపట్నంలోని శాస్త్ర గార్డెన్‌లో శనివారం నిర్వహించిన విద్యార్థి, యువజన ముఖ్యనాయకుల సమావేశ అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆయన తనయుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ఎంకేఆర్ ఫౌండేషన్ స్థాపించి నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో ఉచిత శిక్షణను ఇవ్వడంతో ఎంతో మంది యువకులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ప్రైవేట్ కంపెనీలను నియోజకవర్గంలో ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈనెల 5న ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించే విద్యార్థి- యువజన సమ్మేళనానికి ప్రతి గ్రామ, ప్రతి వార్డు బీఆర్ఎస్ కమిటీలు, బంటి యూత్ ఫోర్స్ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు భాస్కర్‌రెడ్డి, ధ్రువ కుమార్, శ్రీరామ్, రమేశ్ , గోపాల్, రవీందర్, శివ, పవన్, నవీన్, శేఖర్, దేవేందర్‌గౌడ్, గిరి, బాను పాల్గొన్నారు.